క్లుప్తంగా

అక్రమ ఆక్వా చెరువుల తవ్వకాలను ఆపాలి



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ

ఏలూరు (టూటౌన్) : జిల్లాలోని కైకలూరు, మండవల్లి, ముదినేపల్లి, కలిదిండి, ఏలూరు మండలాల్లో అక్రమ ఆక్వా చెరువుల తవ్వకాలను ఆపాలని, దీనికి కారకులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ కోరారు. స్థానిక సంఘ కార్యాలయంలో వ్యవసాయ కార్మిక సంఘం ముఖ్యనాయకుల సమావేశం పి.ఆనందరావు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా యథేచ్ఛగా, అక్రమంగా ఆక్వా చెరువులు తవ్వుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. చెరువల తవ్వకాల వల్ల తాగు నీరు కలుషితమైపోతుందని, పంట చేలు చౌడు బారుతున్నాయంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూములను ఆక్రమించి ఆక్వా చెరువులు తవ్వుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జాన్ రాజు, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ జిల్లా జట్టుకు కొవ్వలి విద్యార్థులు

దెందులూరు: రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ సబ్ జూనియర్స్ పోటీలకు పశ్చిమగోదావరి జిల్లా బాలికలు, బాలుర జట్టుకు కొవ్వలి ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారని ఎస్ఎస్ఎల్‌వీజీ శర్మ అన్నారు. బుధవారం పాఠశాలలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు తూర్పుగోదావరి జిల్లా రామచంద్రపురంలో పోటీలు జరుగుతాయన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా బాలికల జట్టుకు గొల్ల రత్నహారిక ఎంపికకాగా బాలుర జట్టుకు తమ విద్యార్థులు ఏ. ఈనోష్, పీ.సత్యసాయి వంశీ, ఈ.చెర్లెస్ వెస్లీ ఎంపికయ్యారన్నారు.

ఇద్దరు జూదరుల అరెస్టు

ఉంగుటూరు: అప్పారావుపేటలో బుధవారం ఇద్దరిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.35 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్టు చేబ్రోలు పోలీసులు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపర్చినట్టు చెప్పారు.

వలంటీర్ల సేవలు అభినందనీయం

వలంటీర్ల సేవలపై లబ్ధిదారుల ప్రశంసలు

ఏలూరు టౌన్ : నేడు దేశానికే ఆదర్శవంతమైన పాలన రాష్ట్రంలో కొనసాగుతోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తొలినాళ్లలోనే వలంటీర్ వ్యవస్థకు రూపకల్పన చేసి అమల్లోకి తెచ్చారు. గతంలో టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీల పేరుతో పేదవర్గాల ప్రజలు దోపిడీ, వేధింపులకు గురయ్యారో.. ఆనాడు ప్రజాసంకల్ప పాదయాత్రలో ప్రజలంతా సీఎం వైఎస్ జగన్‌కు తమ గోడు చెప్పుకున్నారు. తాను అధికారంలోకి వస్తే దళారీ వ్యవస్థకు చెక్‌పెడతాననీ, అవినీతి, బంధుప్రీతి, దోపిడీ లేని గ్రామ స్వరాజ్యాన్ని తీసుకువస్తానని హామీ ఇచ్చారు. హామీని పక్కాగా అమలు చేస్తూ వలంటీర్, సచివాలయ వ్యవస్థలను సమాంతరంగా తెరపైకి తెచ్చారు. ప్రజలకు ప్రభుత్వ పాలనను ఇంటివద్దకే చేర్చుతూ ప్రజల మనస్సులు గెలుచుకున్నారు. సంక్షేమ పథకాలను వలంటీర్, సచివాలయ వ్యవస్థ ద్వారా లబ్ధిదారులకు నేరుగా అందిస్తున్నారు.





ఏలూరులో సచివాలయం (ఫైల్)

ప్రభుత్వ సేవలు చేరువయ్యాయి



గతంలో ఏదైనా ప్రభుత్వ పథకం కావాలంటే ప్రభుత్వ కార్యాలయాలు, అధికారుల చుట్టూ తిరగాల్సి వచ్చేది. కానీ నేడు వలంటీర్ వ్యవస్థతో ప్రభుత్వ సేవలు ఇంటి వద్దకే చేరువయ్యాయి. నాకు ప్రతినెలా 1వ తేదీన వలంటీర్ రత్నకుమారి ఇంటికి వచ్చి పింఛన్ ఇచ్చి వెళుతుంది. ఇంటి స్థలం వచ్చింది. మాతో మా వలంటీర్ కలిసి మెలసి ఉంటూ ప్రభుత్వ పరంగా ఏమి రావాలో అవి వచ్చేలా చూస్తుంది.

– యల్లాపు మహేశ్వరి, మోటేపల్లివారి వీధి, ఏలూరు

ఆరోపణలు అవాస్తవం



ప్రస్తుతం వలంటీర్ వ్యవస్థపై చేస్తోన్న ఆరోపణలు అన్నీ అవాస్తవాలు. ప్రజలు ఎవరూ వాటిని సమ్మేస్థితిలో లేరు. మా వలంటీర్ గిద్దలూరి రవి మా ప్రాంతంలో ప్రభుత్వ పథకాలు అందరికీ అందేలా చూస్తూ ఉంటారు. గతంలో ప్రభుత్వ పథకాలు కావాలంటే మధ్యలో దళారులు ఉండేవారు. వాళ్లకు ఏదో ఒకటి చెల్లిస్తే గానీ పని అయ్యేది కాదు. ప్రస్తుతం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో అన్నీ ఇంటి దగ్గరకే వస్తున్నాయి.

– కాకి వెంకటలక్ష్మి, మేకల కబేలా, ఏలూరు

ప్రాణాలకు తెగించి..



నాకు మా వలంటీర్ కర్రి సాయిరామ్ ప్రతీ నెలా 1తేదీన ఉదయమే వితంతు పింఛన్ ఇస్తాడు. కరోనా వైరస్ వచ్చినప్పుడు కూడా సంక్షేమ పథకాలు ఆపకుండా ఇవ్వటం అనేది గొప్ప విషయమే కదా. వలంటీర్లు ప్రాణాలకు తెగించి మరీ ప్రజలకు సేవలు అందించారు. మాకు ప్రభుత్వ పరంగా ఏదైనా పథకాలు కావాలంటే వలంటీర్లను అడిగితే చాలు.. అర్హత ఉంటే వెంటనే వస్తుంది. రాజకీయ పార్టీలు చెప్పేవన్నీ నమ్మటానికి జనం ఏమీ పిచ్చివాళ్లు కాదు.

– గొర్రెల భవానీ, రంగారావు కాలనీ, ఏలూరు

అవినీతి లేకుండా..



నాకు అమ్మఒడి వస్తుంది. పిల్లలను చదివించుకుంటున్నాను. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ బడులను ఎంతో అభివృద్ధి చేస్తున్నారు. మా వలంటీర్ సాయిరామ్ మాకు ప్రభుత్వ పరంగా అందాల్సిన పథకాలు అందిస్తున్నాడు. గతంలో పనులు మానుకుని ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. కానీ ఇప్పుడు అవినీతి లేకుండా పథకాల సొమ్ము నేరుగా మా ఖాతాలోకే జమ అవుతుంది.

– బత్తుల మేరీ, ఎంఆర్‌ఆర్ కాలనీ, వన్‌టౌన్ ఏలూరు

కలెక్టరేట్ ఉద్యోగికి నివాళులు



కలెక్టరేట్ ఉద్యోగి జి.సాయినాథ్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

ఏలూరు (మెట్రో) : ఏలూరు కలెక్టరేట్‌లో విధులు నిర్వహించుకొని తిరిగి ఇంటికి వెళుతూ ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో మరణించిన కలెక్టరేట్ ఈ సెక్షన్ సీనియర్ అసిస్టెంట్ జి.సాయినాథ్‌కు బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమీ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, కలెక్టరేట్ సిబ్బంది ఒక నిమిషం మౌనం పాటించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సాయినాథ్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. జేసీ బి.లావణ్యవేణి మాట్లాడుతూ మోటారు సైకిల్ నడిపే సమయంలో అత్యంత జాగ్రత్తగా ఉండి హెల్మెట్ ధరించి ప్రయాణం చేయాలన్నారు. ఇటువంటి ఘటన పునరావృత్తం కాకుండా సిబ్బంది జాగ్రత్త వహించాలన్నారు. సాయినాథ్‌కు నివాళులు అర్పించిన వారిలో కలెక్టరేట్ ఏఓ బి.రమాదేవి, హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ చల్లన్నదొర, ఈ సెక్షన్ సూపరింటెండెంట్ ఎండీ నజీముల్లాషా, కలెక్టరేట్‌లోని వివిధ విభాగాల సిబ్బంది ఉన్నారు.

ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలు

ఏలూరు కోఆప్షన్ సభ్యుడు పెదబాబు

ఏలూరు టౌన్ : పేదలకు సంక్షేమ పథకాలను నేరుగా అందిస్తూ దళారీ వ్యవస్థ లేని పాలన అందిస్తూ దేశానికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఆదర్శంగా నిలుస్తోందని ఏలూరు నగరపాలక సంస్థ కోఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు అన్నారు. ఏలూరు నగరంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని మెడికల్ రిప్రజంటేటివ్స్ హాల్లో నిర్వహించారు. దరఖాస్తు చేసిన లబ్ధిదారులకు వివిధ సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కోఆప్షన్ సభ్యులు పెదబాబు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టిన నాటినుంచీ నాలుగేళ్ల కాలంలో ప్రజలకు ప్రభుత్వ సేవలను ఇంటివద్దకే అందించిన ఘనత మాకే దక్కుతుందన్నారు. అవినీతి రహిత పాలనతో దేశానికే స్ఫూర్తిదాయకమైన పాలనను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో అందుతుందన్నారు. ఇళ్ల స్థలాలు, అమ్మఒడి, జగనన్న విద్యాదీవెన, పెన్షన్, రేషన్ ఇలా ఏదైనా అర్హత ఉంటే చాలు వారికి ఇంటి వద్దకే అందించేలా ప్రత్యేక శ్రద్ధతో పనిచేస్తున్నామని తెలిపారు. మధ్యవర్తులు, దళారులు ఎవరూ లేకుండా నేరుగా సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజలకు పథకాలు చేరుతున్నాయని చెప్పారు. ప్రతిపక్షాలు ప్రజల వద్దకు వెళుతుంటే సమస్యలు ఏమీ లేక ఢీలా పడిపోతున్నారనీ, ప్రతిపక్షాల నోళ్లు మూయించిన ప్రభుత్వం మాదే అన్నారు. ఏలూరు ఎమ్మెల్యే ఆళ్లనాని హయాంలో ఏలూరు నగరంలో ఎంతో అభివృద్ధి జరిగిందని, కరోనా విపత్కర పరిస్థితుల్లో వైద్య ఆరోగ్యశాఖ మంత్రిగా ఆళ్ల నాని ప్రాణాలను లెక్కచేయకుండా రాష్ట్రమంతా ప్రజల కోసం తిరిగారని గుర్తు చేశారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రజలు దరఖాస్తు చేసిన ధ్రువపత్రాలను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏలూరు నగర కార్పొరేటర్ యర్రంశెట్టి సుమన్, కత్తిరి రామ్మోహనరావు, నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ, డిప్యూటీ కమిషనర్ ఎస్.రాధా, పార్టీ నాయకులు తోట శివ, పార్టీ నాయకులు, అభిమానులు, లబ్ధిదారులు ఉన్నారు.



జగనన్న సురక్ష కార్యక్రమంలో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తోన్న పెదబాబు, తదితరులు

ఏలూరు జగనన్న సురక్ష కార్యక్రమంలో ఇలా

ఏలూరు నగరంలో 13వ రోజు జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఏలూరు నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ, తహసీల్దార్ సోమశేఖర్ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు వివిధ రకాల ధ్రువపత్రాలను అందజేశారు. పవర్‌పేట, చేపలతూము–2, ఆర్‌ఆర్‌పేట, రాజీవ్‌గాంధీపార్క్ సచివాలయాలకు సంబంధించి క్లస్టర్‌లో సుమారుగా 2,892 మంది ఆయా సర్టిఫికెట్లకు దరఖాస్తు చేసుకోగా 2,876 మందికి ధ్రువపత్రాలు పంపిణీ చేశారు.

ప్రజల ప్రయాణానికి ఇబ్బంది లేకుండా చూడాలి

దెందులూరు: అలుగులగూడెం- దెందులూరు మధ్య ఉన్న అండర్ పాస్ నిర్మిస్తున్న నేపథ్యంలో ఆ మార్గం గుండా వెళ్లే అన్ని గ్రామాల ప్రజల ప్రయాణ అవసరాలకు ఇబ్బందులు లేకుండా చూడాలని రైల్వే కాంట్రాక్టర్‌ను తహసీల్దార్ ఎన్వీ నాంచారయ్య ఆదేశించారు. బుధవారం వర్షం కారణంగా ఏర్పడిన బురదలో వివిధ గ్రామాల ప్రజలు, వృద్ధులు, విద్యార్థులు ప్రయాణానికి పడుతున్న ఇబ్బందులను అలుగులగూడెం వార్డు మెంబరు ప్రసన్నరాణి, రాణి, తదితరులు తహసీల్దార్‌కు వివరించారు. వెంటనే తహసీల్దార్ రైల్వే కాంట్రాక్టర్‌కు ఫోన్ చేసి ప్రస్తుతం ఉన్న రోడ్డు ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. వేగవంతంగా అండర్‌పాస్ నిర్మాణ పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

పద్మశాలీ సంఘ సమావేశం

ఉంగుటూరు: వచ్చేనెలలో భీమడోలులో నిర్వహించనున్న పద్మశాలీ సంఘ జిల్లా మహాసభను జయప్రదం చేయాలని పశ్చిమగోదావరి జిల్లా సంఘం నాయకుడు, రాష్ట్ర వర్కింగు అధ్యక్షుడు వానపల్లి నాగరాజు పిలుపునిచ్చారు. బుధవారం నారాయణపురంలో ఉంగుటూరు నియోజకవర్గం ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నాగరాజు మాట్లాడుతూ ప్రతి గ్రామం వెళ్లి చేనేత కార్మికుల్లో చైతన్య నింపాలని కోరారు. మండలాలకు బాధ్యలను నియమించామన్నారు. ఈ సమావేశంలో ఎంపీటీసీ సభ్యుడు బండారు నాగరాజు, వానపల్లి ప్రసాదు పాల్గొన్నారు.

మొహర్రం వేడుకలు ప్రారంభం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : నగరంలో బుధవారం మొహర్రం వేడుకలను అత్యంత వైభవంగా ప్రారంభించారు. మహమ్మద్ ప్రవక్త మనుమడు ఇమామ్ హుస్సేన్ కర్బలా యుద్ధంలో అమరుడైన రోజును ముస్లింలు అత్యంత పవిత్రమైన దినంగా పరిగణించి మొహర్రం వేడుకలను నిర్వహించుకుంటారు. ఇదే రోజున ఇస్లామ్ నూతన సంవత్సరం ప్రారంభ శుభ దినం కూడా కావడంతో స్థానిక కుండీ సెంటర్‌లోని హజరత్ మౌలా అలీ మహాత్ముని ఆస్థాన (గొలుసుల పంజా)లో తొలుత అత్తర్ నమాజ్ నిర్వహించారు. అనంతరం మౌలా అలీ మహాత్ముని పేరిట పీర్లు నిలబెట్టి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం దరూద్ సలాం, ఫాతెహా ఖానీ నిర్వహించి షర్బత్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దివ్య ఖుర్‌ఆన్ గ్రంథ పఠనం చేసి భక్తులకు అన్నప్రసాద పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అమలె సున్నత్ వల్ జమాత్ అధ్యక్షుడు ఎస్‌కే సాబీర్ హుస్సేన్, ప్రచార కార్యదర్శి ఎండీ ఇక్బాల్, గొలుసుల పంజా వంశపారంపర్య ముజావర్లు ఎండీ వజీర్ అలీ, ఎండీ గాలబ్ అలీ, ఎండీ మౌలా అలీ, ఎండీ ఖాదర్ అలీ పాల్గొన్నారు.



గొలుసుల పంజాలో పీర్లు నిలబెట్టి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న దృశ్యం

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	100	అరటి కాయ (1)	05–07
వంకాయలు (గులాబీ)	20	చిక్కుడు కాయలు	50
వంకాయలు (కాంతులు)	24	చామదుంపలు	44
వంకాయలు (తెలుపు)	--	ములక్కాడలు	07–10
బెండకాయలు	30	కంద	40
పచ్చిమిర్చి	84	బీట్‌రూట్	42
కాకర కాయలు	40	కీరా దోస	48
బీరకాయలు	--	ఫ్రెంచ్‌బీన్స్	--
బీరకాయలు (పందిరి)	44	అల్లం	188–260
క్యాబేజీ	28	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	40	పాలకూర	12
దొండకాయలు	18	చుక్కకూర	12
బంగాళదుంపలు	24	తోటకూర	12
ఉల్లిపాయలు	24	గోంగూర	07
గోరుచిక్కుడు	40	పుదీనా	05
దోసకాయలు	34	బఠాణి	--
ఆనబకాయ (1)	15–20	క్యాప్సికమ్	108
పొట్లకాయ(1)	15	చిలకడదుంప	30

రజక వృత్తిదారుల సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు (టూటౌన్) : ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో కుల సంఘాల రిజిస్ట్రేషన్ల విషయంలో రజక వృత్తిదారులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా రజక జన సంఘం జిల్లా అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. స్థానిక జిల్లా సంఘ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన రజక నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాలలో రజక వృత్తిదారులు ఇబ్బందులు పడుతున్నారని, సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. జిల్లాలు విడిపోవడం వల్ల కొన్ని గ్రామాలు మారి రిజిస్ట్రేషన్లకు ఇబ్బంది ఎదురౌతుందన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్లు రిజిస్ట్రేషన్ అధికారులకు తగు ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. రజకుల చెరువులను సర్వే చేయించి హద్దు నిర్ణయించాలని, పాడైపోయిన రజక విశ్రాంతి భవనాలకు మరమ్మతులు చేయించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా రజక నేతలు విఠాల శ్రీనివాసరావు, కడెల్లి సుబ్బయ్య, కవులూరి సూర్యచంద్రం, కోటి చుక్కల అప్పారావు, టేకు కృష్ణవేణి, కొండపల్లి సత్యనారాయణ, దువ్వాపు చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	25
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	38
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	40
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	33

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.45	4820	28
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	27
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	27
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	22
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	30
ఏలూరు – బీహెచ్‌ఈఎల్	22.15	34820	34
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	09.00	4794	రద్దు
ఏలూరు – విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు –విశాఖపట్నం	22.00	4838	28
ఏలూరు –తిరుపతి	16.00	4830	33

తలసేమియా చిన్నారులకు అండగా



చిన్నారులకు రక్తమార్పిడి చికిత్స అందిస్తోన్న వైద్యులు

ఏలూరు టౌన్ : ఏలూరు జిల్లాలో తలసేమియా చిన్నారులకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని, వారికి ప్రత్యేకంగా అందించాల్సిన చికిత్సను రెడ్‌క్రాస్ సంస్థ అందిస్తోందని ఏలూరు జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ బీవీ కృష్ణారెడ్డి అన్నారు. ఏలూరు సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలోని రెడ్‌క్రాస్ తలసేమియా భవనంలో బుధవారం 11 మంది చిన్నారులకు తలసేమియా రక్తమార్పిడి చికిత్స అందించారు. ఈ సందర్భంగా జిల్లా లయన్స్ క్లబ్ గవర్నర్ గట్టు మాణిక్యాలరావు, సభ్యులు పద్మజ, డీసీఎస్ మల్లేశ్వరరావు, సీహెచ్ అవినాష్ తలసేమియా చిన్నారులను పరామర్శించారు. వారికి పండ్లు పంపిణీ చేశారు. తలసేమియా చిన్నారులతోపాటు వారి తల్లిదండ్రి, సహాయకులు 30 మందికి మానవత విద్యనిధి, కేంద్ర నియంత్రణ కమిటీ చైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు ఉచిత భోజన సదుపాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో జిల్లా రెడ్‌క్రాస్ కార్యదర్శి బి.బెన్నీ, డాక్టర్ ఆర్ఎస్ఆర్‌కే వరప్రసాద్, మానవత సభ్యులు కడియాల కృష్ణారావు, రత్నాకరరావు, లయన్స్ క్లబ్ సభ్యులు ఉన్నారు.

పౌష్టికాహారాన్ని సక్రమంగా పంపిణీ చేయాలి

పెదపాడు: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లల్లో పోషణ లోపాన్ని నివారించేందుకు, రక్త హీనతను తగ్గించేందుకు ప్రభుత్వం ద్వారా అందించే పౌష్టికాహారాన్ని అందరికీ అందేలా కృషి చేయాలని ఏపీ ఫుడ్ కమిషన్ మెంబరు జీ దేవి సూచించారు. బుధవారం పెదపాడు ఐసీడీఎస్ పరిధిలోని వట్లూరు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రం ద్వారా అందుతున్న సేవలను పరిశీలించారు. పిల్లలు ఎత్తు బరువు రికార్డులను పరిశీలించారు. లోప పోషణ గల పిల్లలపై ఎక్కువ శ్రద్ధ తీసుకోవాలన్నారు. పూర్వ ప్రాథమిక విద్య కార్యక్రమాలు అమలు జరుగుతున్న విధానాన్ని పిల్లల ద్వారా అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్ కిట్‌లు పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి అందుతున్న సేవలపై ఆరా తీసారు. మధ్యాహ్న భోజనం అమలును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు డైరక్టరు పద్మావతి అదనపు సీడీపీఓ రాజశేఖర్ పాల్గొన్నారు.